విజయదశమి శుభాకాంక్షలు



విజయదశమి పండుగ సందర్భంగా
నేడు మా కార్యాలయమునకు సెలవు.
పునర్దర్శనం శుక్రవారం.



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23

visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 5 విశాఖపట్నం, 5 అక్టోబరు 2022 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00







## దసపల్లా భూములపై విజయ సాయి రెడ్డి స్పందన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** టీడీపీ అనుకూల పత్రికల్లో వచ్చిన వార్తలని ఖండిస్తున్నానని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. దశపల్లా భూములపై సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారమే ప్రభుత్వ నిర్ణయం జరిగిందని, టీడీపీ ప్రభుత్వ హయం లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అప్పటి అడ్వకేట్ జనరల్ సూచన మేరకు తాజా నిర్ణయం తీసుకున్నారని, రాణి కమల దేవి ఈ భూమికి యజమానురాలుగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, కొన్ని పత్రికలు, కొన్ని రాజకీయ పార్టీ లు పని కట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విజయసాయిరెడ్డి విరుచుకుపడ్డారు.

సర్క్యూట్ హౌస్, నావికా దళ కార్యాలయం కూల్చి వేస్తారు అనేది అసత్య ప్రచారమని, దశ పల్లా భూమలని 22ఏ నుండి తొలగించడం ద్వారా 40 ఎకరాల్లో 500 మంది గృహ యజ మానులకు ప్రయోజనం చేకూరితుందని, 64 మంది ఫ్లాట్ యజ మానుల పరిధి లో వున్న 20 శాతం భూమిని మాత్రమే ఎషూర్ డెవలపర్స కి అప్పగించారని, టీడీపీ కార్యాలయం ఉన్న భూమి కూడా దసపల్లా భూములలోనిదేనని ఆయన ప్రకటించారు.

ఆంధ్రకు పట్టిన గ్రహణం పచ్చ కుల మీడియా అని వైఎస్ఆర్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎంపీ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఆ మీడియా చంద్రబాబు కోసం విశ్వసనీయతను పూర్తిగా వదిలేసిందని దుయ్యబట్టారు. ఏపీ ప్రతిపక్ష నేతను లేపి నిల్చోబెట్టినా ప్రయోజనం ఉండదన్న ఆయన ప్రజా సేవలో ఉన్న మర్యాదస్తుల మీద కుల పిచ్చితో విషం చిమ్ముతోందని అగ్రహం వ్యక్తం చేశారు. దస్పల్లా భూముల పేరుతో నీచపు రాతలు రాయించడం,

(మిగతా 2లో)

## నూకాంబిక అమ్మవారి సప్త ప్రాకార సేవలో స్వరూపానందేంద్ర సరస్వతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ నూకంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా మంగళవారం రేజేటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సప్తప్రాకార సేవ అతి వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖ శారద పీఠం శ్రీ స్వరూపానంద సరస్వతి మహా స్వామి, హాజరై అమ్మవారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సేవలో పాల్గొన్న మాజీ మంత్రి రాష్ట్ర వైసిపి ప్రధాన కార్యదర్శిదాడి వీరభద్రరావు, పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బీ శెట్టి వెంకట సత్యవతి డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు, వైసీపీ నాయకులు దాడి

(మిగతా 2లో)

## "ఆప్ కీ ఆవాజ్" రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా గంట్ల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** "ఆప్ కీ ఆవాజ్" రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నగరానికి చెందిన గంట్ల శ్రీనుబాబును నియమిస్తూ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు పివిజి విశ్వనాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం డాబా గార్డెన్స్ వైజాగ్ జర్నలిస్టుల ఫోరం కార్యాలయంలో శ్రీనువాబు కు ఈ ఉత్తర్వులు అందజేయడం జరిగింది. అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యుడిగా, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శిగా, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడుగా, నేవల్ డాక్ యార్డు ఉద్యోగుల సంఘం(కెటి బి) గౌరవ అధ్యక్షుడిగా విశేష సేవలందిస్తున్నారు.ఈ మేరకు ఆయన సేవలను పరిగణలోకి తీసుకుని తమ కార్యవర్గంలో రాష్ట్ర ఉపాధక్ష్యుడుగా నియమించడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు.తమ సంస్థ ప్రజలకు ఆయా రంగాల్లో ఉచితంగా సేవలందిస్తుందన్నారు. ప్రధానంగా వినియోగదారుల హక్కులు, మానవ హక్కులు, ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్, యూత్ వెల్ఫర్,రైట్ టూ ఇన్‌ఫర్‌మేషన్ వంటి అనేక రకాల సేవలను అందిస్తున్నామన్నారు. తమ న్యాయవాదుల

(మిగతా 2లో)

## రాష్ట్రంలో రానున్న 3-4 రోజుల్లో భారీ వర్షాలు



తెలుగు రాష్ట్రాల్లో మరోసారి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీ, తెలంగాణలో మరో మూడు నాలుగు రోజులపాటు భారీ వర్షాలు పడనున్నాయి.

హైదరాబాద్ తోపాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ బంగాళాఖాతంలో స్థిరంగా కొనసాగుతున్న ఆవర్తనం ప్రభావంతో సోమవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి నైరుతి దిశగా వంపు తిరిగి ఉంది. ఇది రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదిలి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో హైదరాబాద్ తోపాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రాథమిక హెచ్చరిక జారీ చేసింది.

ఏపీలోనూ రానున్న మూడు రోజులపాటు భారీ వర్షాలు మరోవైపు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా.. సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. ఈ అల్ప పీడనం పశ్చిమ వాయువ్య దిశగా

(మిగతా 2లో)




# అల్లూరి జిల్లాలో వికసిస్తున్న కమలం

## రాబోయే ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వనున్న బీజేపీ ?



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో బీజేపీ చాపకింద నీరులా కమలం వికసిస్తున్నది,గత రెండు ఏళ్లుగా బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం వల్ల బీజేపీ సంస్థ గతంగా ప్రతీ బూత్ లో బీజేపీ సభ్యులు గా చేర్పించారు ,ప్రతీ బూత్ లో కమిటీ అధ్యక్షుడు తో పాటు 9 మంది సభ్యులును కమిటీ లో వేశారు,మూడు బూత్ లకు ఒక శక్తి కేంద్రం కూడా వేశారు, శక్తి కేంద్ర ప్రముఖలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు విజయవాడలో జరిగిన సమావేశంలో శక్తి కేంద్ర ప్రముఖులు తో అయన పార్టీ సిద్ధాంతం కోసం రాబోయే ఎన్నికల్లో తీసుకోవాలసిన జాగ్రత్తలు పై ఒకరోజు అంతా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిశానిర్దేశం చేశారు,పాడేరు ,అరకు,రంపచోడవరం, నియోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో మండలం కమిటీలు పూర్తి చేశారు, 22 మండలాల్లో బీజేపీ కార్యాక్రమాలు జరుతున్నాయి. బీజేపీ అనుబంధ మోర్చా లు కమిటీ లు పూర్తి స్థాయిలో పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు,పాడేరు లో స్వర్గీయ కురుసా బొజ్జయ్య మరణాంతరం ఆయన కుమారుడు పూర్తి బాధ్యతలు తలనెత్తుకుని అన్ని మండలాల్లో కమిటీ లు పూర్తి చేశారు, ఆయనకు బీజేపీ అధిష్టానం జిల్లా అధ్యక్షుడు గా నామినేట్ చేసి 3 నియోజకవర్గ ల్లో పార్టీ బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు, గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో 2 సార్లు బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన స్వర్గీయ లోకుల గాంధీ కి అప్పట్లో బీజేపీ రాష్ట్ర కమిటీ లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా చోటు కల్పించారు, ఆయన బీజేపీలో తనకంటూ ప్రత్యేకమైన కేడర్ తయారు చేశారు, రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తర్వాత బీజేపీ ఆయనకు పార్టీ లో ఉన్నత స్థాయి పార్టీ భాద్యతలు ఇచ్చి కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు గా నామినేటెడ్ ఇచ్చింది, ఆయన రాష్ట్రంలో నలుమూలల పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయన ఏడాది క్రితం హఠాత్తుగా మరణించిన తరువాత పార్టీ పెద్దలు,కార్యకర్తలు విస్తుపోయారు, పార్టీ కి మంచి నాయకులు పోయారని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నాయకులు కూడా పార్టీ ఇబ్బందులు ఎదురవ్వడం తో పార్టీ అధిష్టానం ఆలోచన లో పడింది

ఆయన మరణాంతరం ,రాష్ట్రంలో బీజేపీ అరకు పార్లమెంట్ జిల్లాలో బలమైన నాయకులుతో సమాలోచన చేసి బీజేపీ జిల్లా భాద్యతలు కొత్త నాయకులు చేర్చుకున్న తర్వాత బీజేపీ జిల్లా అధ్యక్షుడు గా పాంగి రాజారావు బలమైన సామాజిక వర్గానికి చెందిన ఆయనకు కట్టబెట్టారు, కురుసా ఉమామహేశ్వరరావు కు రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు గా ఆయనను నియమించారు, జిల్లాలో పాంగి రాజారావు, కుడా కృష్ణరావు అనుచరులు సైతం బీజేపీలో చేరక తప్పలేదు, వారు ఒకరు జిల్లా అధ్యక్షుడు గా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు నియమించారు మరోకరుకి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా కురుసా ఉమామహేశ్వరరావు నియమించారు , 3 నియోజవర్గల్లో బలమైన కార్యకర్తలు నాయకులు ఇప్పుడు పూర్తి స్థాయిలో కార్యాక్రమాలు నిర్వహించారు, నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రజా పోరు యాత్ర అల్లూరి జిల్లాలో పూర్తి స్థాయిలో జరిగాయి, బలమైన సామాజిక వర్గాలుకు సైతం బీజేపీ అధిష్టానం సల్లా రామకృష్ణ కు బీజేపీ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి గా కేంద్ర ప్రభుత్వ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నామినేట్ చేశారు,గత ఎన్నికల్లో అరకు అభ్యర్థి గా పోటీ చేసిన అడపా బొంజునాయుడు కి రాష్ట్ర కాన్సిల్ సభ్యుడిగా ,లకే భాస్కర్ కు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు గా నియామకాలు చేశారు, సీనియర్ నాయకులు కు కురుసా రాజారావు కు ఉత్తారాంధ్ర గిరిజన మోర్చా జోనల్ ఇంచార్జ్ గా ,పెనుమాక రవికుమార్ కు బీజేపీ ఎస్సి మోర్చా జోనల్ ఇంచార్జ్ గా,మినుములు గోపాల పాత్రుడు కు రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యులు గా మరో బీజేపీ చింతపల్లి అధ్యక్షుడు కు కేంద్ర కాఫీ బోర్డు సబ్యుడు గా జైతే ప్రభాకర్ ను మరో మాజీ మండల అధ్యక్షుడు తాంగుల విశ్వనాధం కి కాఫీ బోర్డు 3 గురు కి నామినేటెడ్ నియామకాలు చేశారు, అన్ని వర్గాలకు బీజేపీ లో అధిష్టానం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రస్తుతం బీజేపీలో భారీ చేరికలు అయ్యాయి ప్రజా పోరు యాత్ర లో బీజేపీ గిరిజన ప్రాంతాల్లో బలోపేతం చేసేందుకు అధిష్టానం కృత నిశ్చయముగా ఉంది ,ప్రజలు సైతం బీజేపీ పట్ల ఆకర్షితులు అవుతున్నారు, రాబోయే ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వబోతోంది బీజేపీ అని పలు సామాజిక వర్గాలు అంటున్నాయి.

# కలెక్టర్ చొరవతో మహాలక్ష్మికి ఫించన్



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** వృద్ధురాలి పట్ల కలెక్టర్ ఔదార్యంతో చొరవ తీసుకోవటంతో మహాలక్ష్మి అనే వృద్ధురాలికి పింఛన్ పునరుద్ధరణ జరిగింది. విఆర్ పురం మండలం చినమట్టపల్లి పంచాయతి చింతరేవుపల్లి గ్రామానికి చెందిన 80 ఏళ్ళ వృద్ధురాలు కోట్ల మహాలక్ష్మి, తనకు పది నెలలుగా ఫించన్ అందటం లేదని, సచివాలయం చుట్టూ తిరిగినా ఐరిస్, వేలి గుర్తులు పడకపోటం వళ్ళ, వారు కూడా నిస్సహాయత వ్యక్తం చేయటంతో ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్త పరిచారు.

ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవ తీసుకుని ఆమెకు 24 గంటలలో పింఛన్ అందజేసి తన ఔదర్యాన్ని చాటుకున్నారు. తన దృష్టికి విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో సంప్రదించి, వృద్యాప్యం కారణంగా వేలిముద్రలు, ఐరిష్ పడకపోయినప్పటికీ విజయవాడ లోని సాంకేతిక సిబ్బందితో సంప్రదించి మాన్యుయల్‌గా సవరించి ఆమెకు పింఛన్ పునరుద్ధరించారు. సమస్య తెలిసిన 24 గంటలలోనే సమస్య పరిష్కరించి ఫించన్ అందజేసి మానవత్వం చూపిన కలెక్టర్ కు వృద్ధురాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల నుండే యధావిధిగా పింఛన్ వస్తుందని, జనవరి 2023 నుండి పెంచిన పింఛన్ రూ.2750/- అందజేస్తామని డిఆర్డిఎ ఇంచార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. మురళి తెలిపారు.

ఈ నెల ఫించన్ ఆ గ్రామ సర్పంచ్ పిట్టా రామారావు చేతుల మీదుగా అందచేయటంతో మహాలక్ష్మి సంతోషం వ్యక్తం చేసింది.

# 15 నుండి కుటుంబ వైద్యుడు విధానం



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో కుటుంబ వైద్యుడు విధానం ఈ నెల 15 నుండి ప్రయోగాత్మకంగా ప్రారంభం అవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాధ రావు తెలిపారు. స్థానిక గిరిమిత్ర సమావేశం మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లతో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సమీక్షించారు. కుటుంబ వైద్యుడు విధానంలో వైద్యులు, ఏఎన్ఎం, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఆశ, సూపర్వైజర్ పాల్గొంటారని ఆయన చెప్పారు. ప్రతి వైయస్సార్ హెల్త్ క్లినిక్ ను నెలకు రెండుసార్లు 104 వాహనంలో తనిఖీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. గర్భిణీలను పర్యవేక్షణ చేయాలని, ఇంటింటిని సందర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని ఆయన సూచించారు. కదలలేని స్థితిలో ఉన్న దీర్ఘకాలిక రోగులను తనిఖీ చేసి సరైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. అర్హులైన పింఛనుదారులను గుర్తించి దృపత్రాలను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. వైద్య విభాగం పింఛను కానుకపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలో సిడి, ఎన్ సిడి సర్వే పది రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ గుర్తింపు కార్డుల నమోదులో దేశంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందని - ఆయుష్మాన్ ఉత్కృష్ట అవార్డు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఇదే పని విధానాన్ని కనబరచాలని ఆయన కోరారు. అవార్డు రావడం మరింత బాధ్యత పెంచిందని దీన్ని నిలుపుకుంటకు మరింత శ్రమించాలని ఆయన సూచించారు. మారుమూల ప్రాంతంలో ప్రజలకు మంచి వైద్యం అందించడం వలన ఎంతో సంతృప్తి కలుగుతుందని చెప్పారు. జిల్లాలో మాతృ మరణాల రేటు గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ మేరకు సరైన ప్రణాళికలు ఉండాలని చెప్పారు. గర్భిణీలకు తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రసవ తేదీకి ముందుగానే సంబంధిత ఆసుపత్రి లో చేర్చాలని స్పష్టం చేశారు. గర్భిణీలు, పిల్లల నమోదు కార్యక్రమాన్ని ఆర్సిహెచ్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. రాష్ట్ర సరాసరి కన్నా తక్కువగా కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించడం పట్ల సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇమ్యునైజేషన్ కార్యక్రమం బాగా జరుగుతున్నప్పటికీ ఆన్లైన్లో నమోదు సక్రమంగా లేదని ఆయన తెలిపారు. ఆన్లైన్ నమోదు పక్కాగా జరగాలని ఆయన ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు శత శాతం ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయ అధికారి ధవళ భాస్కరరావు, సీతంపేట ఐటిడిఏ డిప్యూటీ డిఎంహెచ్ఓ కే విజయ పార్వతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం జనసేన నాయకుల తీరే వేరు

**పిఠాపురం, (విశాఖ సమాచారమ్):** పిఠాపురం నియోజకవర్గంలోని జనసేన పార్టీకి ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉందని ఆ పార్టీ అభిమానులు చెపుతూ ఉంటారు కానీ జనసేన పార్టీలోని నాయకులుగా చెప్పుకునే వారు కొందరు తీరును చూస్తుంటే అభిమానులకు సైతం చిరాకు పుట్టించే విధంగా ఉందని కొందరు ఆవేదన వ్యక్తంగా చేస్తున్నారు. అధిష్టానం ఆదేశాలు మేరకు కొందరు నాయకత్వం వహిస్తున్న వారిని సైతం లెక్కచేయకుండా మరికొందరు వారి యొక్క ఆధిపత్యాన్ని చూపించడానికి ప్రయత్నిస్తున్నారు ఈ పరిస్థితులు పిఠాపురం లోని ఎప్పుడు ఇదే విధంగా కొనసాగుతూనే ఉన్నాయి పైన పార్టీ నాయకుల దగ్గర తమ బలాన్ని నిరూపించుకోవడానికో లేకపోతే తమ ఆధిపత్యాన్ని కొనసాగించుకోవడానికో తెలియడం లేదు, కానీ చూసే వారికి మాత్రం ఈ యొక్క చర్యలు చాలా విడ్డూరంగా అనిపిస్తున్నాయి సాధారణంగా ఏదో ఒక సంఘటనలో నాయకులు మధ్య అభిప్రాయప్రాయాలు వచ్చాయి అంటే పర్వాలేదు కానీ కింద స్థాయిలో పార్టీ ఈ విధంగా నడుస్తూ ఉందంటే ఆ నియోజకవర్గానికి దెబ్బగా మారుతుంది అన్న విషయాన్ని వారు ఎందుకు గ్రహించలేకపోతున్నారన్న విషయం అర్థం కావట్లేదని జనసేన పార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు, ఎప్పటినుంచో పార్టీని జెండాను మోస్తున్న వారు కొందరైతే ఈ మధ్యకాలంలో కొత్త కొత్త నాయకులు వచ్చి తానే అంత నడిపిస్తున్నట్టు ప్రవర్తించడం పట్ల పిఠాపురం నియోజకవర్గంలో పార్టీను ఏ తీరును నడిపిస్తున్నారు.

అన్న అనుమానం కనిపిస్తుంది వారికి ఎంతటి ధీమా ఉన్నప్పటికీ అధిష్టానం యొక్క ఆదేశాలను అనుసరిస్తూ తమ పార్టీ నాయకుల్ని గౌరవించవలసిన కనీస ధర్మం ఉంటుంది కదా అని కొందరు అభిప్రాయ పడుతున్నారు, ఈ మధ్యకాలంలో మహాత్ముని జయంతి సందర్భంగా వారి మధ్య సఖ్యత చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది నాయకత్వం వహిస్తున్న వారిని సైతం లెక్కచేయకుండా ముందుకు వెళుతున్నారా అన్న అభిప్రాయం అయితే చూసినవారిలో కలిగింది అన్నది మాత్రం సత్యమని చెప్తున్నారు, వీరి మధ్య భేదాభిప్రాయాలు క్రింది స్థాయి జన సైనికులలో కూడా వ్యాపించకుండా ఉండేవిధంగా చూసుకుంటేనే జనసేన పార్టీని బలోపేతం చేసుకోగలమని లేకపోతే ముందు ముందు ఎవరు ఏమిటి అన్న విషయం కూడా పార్టీలోని వారికే అర్థం కాదని జనసేన అభిమానులు వాపోతున్నారు, మొహమాటం కొలది ఎవర్ని కాదనలేక వారి వెనక నిలబడవలసి వస్తుందని మరో పార్టీతో సంబంధం ఉన్న నాయకులు కూడా ఈ పార్టీలోని నాయకులుగా చలామణి అవుతుంటే ఏమనాలో అర్థం కాక తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ,ఏమి మాట్లాడలేని స్థితిలో ఉన్నారని ఇదే విధంగా ఉంటే ఏ విధంగా అయితే గతంలో జనసేన పార్టీలో పిఠాపురంలో విభేదాలు చెలరేగాయో అదే అవే పరిస్థితులు పునరావత్వం అవుతాయేమో అన్న అనుమానం జనసైనికుల్లో కలుగుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు, జనసేన పార్టీలోని ప్రధాన నాయకులు యొక్క చూపే పిఠాపురం నియోజవర్గంపై ఉందన్న వినికిడి అయితే వినిపిస్తుంది, కానీ ఆ నియోజకవర్గంలో పరిస్థితులు ఈ విధంగా ఉన్నట్లయితే అది పార్టీకి మేలు జరుగుతుందా అన్న విషయాన్ని వారి ఆలోచించుకోవాలని ఈ మధ్యకాలంలో కొత్తగా వచ్చిన నాయకులు హడావిడి చూస్తూ ఉంటే పార్టీకి మేలు చేయడం కాకపోయి పల్టీ కొట్టించే విధంగా ఉందని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు, కొత్త కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టానంతమాత్రాన్న అభిమానుల్లోకి చొచ్చుకుని వెళ్లలేమని వారందరినీ కలుపుకొని పోయినప్పుడే పార్టీని బలోపేతం చేసుకోగలమన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని జనసైకులు వాపోతున్నారు , ధనం మద్యం పార్టీకి విలువలకు పూర్తి వ్యతిరేకమని వాటిని ఉపయోగించుకుని పిఠాపురం నియోజకవర్గం పార్టీలోని చక్రం తిప్పుదాం అనుకున్నా వారి కలలు కలలుగా ఉండిపోయిన పర్వాలేదు కానీ పార్టీకి కలంకంగా మారితే మాత్రం అభిమానులు చూసి ఊరుకుండే పరిస్థితి అయితే ఉండదని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# డిసెంబర్ 21 కి లక్షా ఏభై వేల మందికి టిడ్కో గృహాలు



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** నేడు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ విశాఖ జిల్లాలో పర్యటనలో భాగంగా రాష్ట్రం మొత్తము మీద అక్టోబర్ మరియు డిసెంబర్ నెలాఖరు 2022 నాటికి వివిధ కార్పొరేషన్లు మునిసిపాలిటీ లలో సుమారుగా 1.50 లక్షల టిడ్కో గృహ ప్రవేశాలకు సంబంధించి ముందస్తు కార్యాచరణ పై టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఐ.ఏ.ఎస్ వారితో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా టిడ్కో ఇంజనీరింగ్ అధికారులు మరియు కాంట్రాక్టింగ్ ఏజన్సీ ప్రతినిధులకు జరిగే సమీక్షా సమావేశములో ఉదా కార్యాలయం నందు టిడ్కో కార్యాలయం నుండి పాల్గొనడం జరిగింది. జూమ్ మీటింగ్ ద్వారా రాష్ట్రములో జరుగుతున్నటువంటి, టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ (హౌసింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) యొక్క పనుల పురోగతి పై సంభందిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బందితో కలిసి సంయుక్తంగా చర్చించడంతో పాటుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీతకాలవ్యవధిలోపల ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులకు ఏజెన్సీ సిబ్బందికి తెలియజేయటం జరిగింది. జి.వి.యం.సి పరిధి లో గృహ ప్రవేశాల ప్రారంభో త్సవమునకు కార్యాచరణ చేస్తున్నటువంటి రాజీవ్ కాలనీ, గౌరినగర్, ముత్యమాంబ కాలనీ, పైడిమాంబ కాలనీ, చిలకపేట, సీహార్స్ పరవాడ రాతిచెరువు,సత్యనారాయణ పురం, పరవాడ ఆదర్శగ్రామం ప్రాజెక్ట్ లోకేషన్స్ లలో ఇంకనూ చేయవలసి ఉన్నటువంటి పనులను త్వరితంగా పూర్తిచేసి లబ్దిదారులకు అందించే ప్రణాళిక తయారు చేసి ప్రాతిపదికన అక్టోబర్ నెల లో 3000మరియు డిసెంబర్ 22 నాటికీ మరో 4000 గృహాలను అందించాలని నిర్దేశించడమైనది.ఇప్పటికే రాష్టంలో గత మూడు నెల ల్లో విజయనగరం ఉమ్మడి తూర్పు గోదావరి ఉమ్మడి వెస్ట్ గోదావరి ఉమ్మడి నెల్లూరు ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ఇప్పటికే ఏభై వేలు గృహాలు అందిచాము అక్టోబర్ నెల లో శ్రీకాకుళం జి వి ఎం సి మండపేట మంగళగిరి తెనాలి చిలకులూరిపేట పొన్నూరు నంద్యాలలో మరో 25000 గృహాలను అందించుటకు సిద్ధం చేసుకోవాలని మిగిలిన 75000 గృహాలు నవంబర్ డిసెంబర్ నెలల్లో హౌసింగ్ .. మురుగు నీటి శుద్ధి (ఎస్ టి పి ) .. ఇన్ఫ్రాస్ట్రక్చర్ ( రోడ్లు మంచినీటి డ్రైనేజీ ఎలక్ట్రికల్ ) అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులు కు అందించాలి అని అధికారులు కు ఆదేశించడమైనది. విధముగా లబ్ధిదారులకు రుణాల మంజూరు కల్పించే విషయములో మెప్మా డిపార్ట్మెంట్ అధికారులు మరియు టిడ్ కో అధికారులు కలిసి సమన్వయముతో పనిచేయాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిడ్కో చీఫ్ ఇంజనీర్.గోపాల క్రిష్ణారెడ్డి , జోనల్ సూపరెంటెండింగ్ ఇంజనీర్స్, అన్ని జిల్లాల ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్ సహెూద్యోగు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాంగం

బుధవారం 5-10-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
ఆశ్వీయుజ మాసం

తిథి : దశమి మ. 12.00
నక్షత్రం : శ్రవణం రా. 09.15
వర్జ్యం : రా.12.59 ల 02.28 వ



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నై నగరంలో ఉన్నారు.
సెల్ : 9440537607


(మొదటి పేజీ తరువాయిలు)

### దసపల్లా భూములపై విజయ సాయి రెడ్డి స్పందన

రాయడం దాంట్లో భాగమేనని చెప్పారు. పలు అంశాలపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

అబద్ధాలను పదే పదే చెప్పి ప్రజలను నమ్మించవచ్చన్న గోబెల్స్...చివరకు ఏమయ్యాడు? అని చంద్రబాబు అనుకుల మీడియాను ప్రశ్నించారు. నమ్మించడానికి, యుద్ధంలో గెలవడానికి చాలా వ్యత్యాసం ఉందని తెలుసుకునేసరికి ఏమీ మిగల్లేదు, చివరకు ప్రాణం కూడా, అసత్యాల కట్టు కథలపై ఆధారపడిన వారి రాజకీయ ముగింపూ అలాగే ఉంటుందని చెప్పారు.

జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపిందని చెప్పారు. ఫలితంగా భారీ మొత్తాల్లో గంజాయి పట్టుబడిందని, గంజాయిని పట్టుకుంటే స్వాగతించకుండా ప్రభుత్వంపై బురద చల్లడం ఏంటి? అని చంద్రబాబు అనుకూల మీడియాను ప్రశ్నించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి పరిమాణమే ప్రభుత్వ పనితీరుకు గీటురాయని చెప్పారు.

### నూకాంబిక అమ్మవారి సప్త ప్రాకార సేవలో స్వరూపానందేంద్ర సరస్వతి

జైపీర్, కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య, 80వ వార్డు వైసిపి ఇన్చార్జ్ కొణతాల భాస్కరరావు.కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

దసరా నవరాత్రులు సందర్భంగా ఆలయం వద్ద ఉచిత అన్నదానం విరాళం దాతలు ఈ సుధీర్, జి శ్రీనివాసరావు, జి నూకరాజు,దంపతులు అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బుద్ధ లక్ష్మి నగేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

### "ఆప్ కీ ఆవాజ్" రాష్ట ఉపాధ్యక్షుడుగా గంట్ల

ద్వారా అనేక సమస్యలను ఇప్పటికే పరిష్కరించగలిగామన్నారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ తనకు కీలకమైన బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. శక్తివంచన లేకుండా తన వంతు సేవలు అందిస్తామన్నారు.ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ సంస్థ ద్వారా ఎంతో మంది తగిన సహాయం పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఉపాధ్యక్షుడు ఎన్పి రాజు,తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో రానున్న 3-4 రోజుల్లో భారీ వర్షాలు

కదులుతోంది. బుధవారనం నాటికి ఇది ఏపీ తీరం వైపునకు పయనించనుంది. దీంతో కోస్తాంధ్ర, రాయలసమీలో చాలా చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

కోస్తా, రాయలసీమలో వర్షాలతోపాటు పిడుగులు పడే ఛాన్స్ రాయలసీమ, కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులూ పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40-45 కిలోమీటర్లు, గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. సముద్రం అలజడిగా ఉంటుందని.. రానున్న మూడు రోజులపాటు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని సూచించింది. కాగా, సోమవారం కూడా రాష్ట్రంలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. మంగళ, బుధవారాల్లోనూ రాష్ట్రంలోని చాలా చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## మధుమేహం నియంత్రణకు అద్భుత ఔషధం తులసి నీళ్లే



నీళ్లతో బ్లడ్ షుగర్ తగ్గించుకోవచ్చని చాలా తక్కువ మందికి తెలుసు. తులసి ఆకుల నీళ్లను మధుమేహం తగ్గించేందుకు ఎలా వాడాలనేది ఇప్పుడు తెలుసుకుందాం.

ఆయుర్వేదంలో, హిందూ ఆధ్యాత్మికతలో తులసి మొక్కకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. తులసి మొక్క ఆకులు, గింజలతో అద్భుత ప్రయోజనాలున్నాయి. తులసి ఆకుల నీళ్లతో మధుమేహాన్ని సైతం నియంత్రించవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుత బిజీ ప్రపంచంలో మధుమేహం అనేది పెనుసవాలు విసురుతున్న సమస్యగా మారు తోంది. మధుమేహం నియంత్రణలో ఉంటేనే ఆరోగ్యపరంగా బాగుంటుం ది. ఎందుకంటే బ్లడ్ షుగర్ అనేది చాలా ప్రమాదకరం. బ్లడ్ షుగర్ స్థాయి పెరిగేకొద్దీ డయాబెటిక్ పేషెంట్‌గా మారిపోతారు. అయితే ఆయుర్వేదంలో మధుమేహానికి మంచి ప్రత్యామ్నాయం ఉందంటున్నారు వైద్యులు. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలితో చాలావరకూ రోగాల్ని దూరం చేసుకోవచ్చు. అయితే చిన్న చిన్న విషయాల్ని దృష్టిలో పెట్టుకుంటే..బ్లడ్ షుగర్ స్థాయిని నియంత్రించవచ్చు. అయితే తులసి

మధుమేహం నియంత్రణలో తులసి నీరు

మధుమేహం నియంత్రణలో ఉండాలంటే ముఖ్యంగా కావల్సింది బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గించుకోవాలి. ఓ గ్లాసు నీళ్లలో తులసి ఆకులు కొన్ని వేసి ఉడికించాలి. ఆ తరువాత ఆ నీటిని వడపోసి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తాగాలి. ఇలా చేస్తే బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయంటున్నారు ఆయుర్వేద వైద్య నిపుణులు.

ఆయుర్వేద వైద్యశాస్త్రంలో తులసి నీళ్లతో చాలా ప్రయోజనాలున్నాయి. తులసి నీళ్లు జలుబు, దగ్గు తగ్గించేందుకు అద్భుతమైన ఔషధంగా ఉపయోపడతాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగపడుతుంది. ఆధునిక పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించేందుకు తులసి ఆకులు గానీ, తులసి నీళ్లు గానీ మీ డైట్‌లో భాగంగా చేసుకుంటే మంచి ఫలితాలుంటాయి. తులసి ఆకులతో టీ కూడా చేసుకుని తాగినా మంచి ఫలితాలుంటాయి.

## గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత ఇవి మాత్రమే తినాలి

గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత సహజంగా ఎటువంటి డైట్ పాటించాలని అనుకుంటే ఎలాంటి ఆలస్యం చేయకుండా దీన్ని పూర్తిగా చూసేయండి. డీహైడ్రేషన్ కు గురి అవకుండా ఉండాలంటే ప్రతి రోజు రెండు లీటర్ల వరకూ ఫ్లూయిడ్స్ తీసుకోవాలి. ఆహారాన్ని తీసుకునే సమయంలో మంచి నీటితో పాటు ఎలాంటి లిక్విడ్స్ కూడా తీసుకోకూడదు. కేవలం ఆహారాన్ని తీసుకున్న 30 నిమిషాల తర్వాత మాత్రమే మంచి నీళ్లు లేదా ఇతర లిక్విడ్స్ తీసుకోవాలి. ఇలా చేయడం చాలా అవసరం అని గుర్తుంచుకోండి. అంతే కాకుండా ఆహారం తీసుకునే 30 నిమిషాలు ముందు కూడా ఎలాంటి లిక్విడ్స్ తీసుకోకూడదు.

ఒకవేళ మంచి నీళ్ళను ఆహారం తీసుకునే సమయంలో తాగాలనుకుంటే చాలా నెమ్మదిగా సిప్ చేయాలి. ఎక్కువ మోతాదులో మంచి నీరును తీసుకోవడం వల్ల వాంతులు, వికారం, డయేరియా మరియు చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనబడతాయి.

ప్రతి రోజు ఆహారాన్ని బ్యాలెన్స్‌గా తీసుకోండి. ప్రోటీన్ ఉండే పదార్థాలను తప్పకుండా తీసుకోవాలి. ఎలాంటి ఆహార పదార్థాలలో అయితే ఎక్కువగా కొవ్వు పదార్థాలు, పంచదార ఉంటుందో వాటిని తీసుకోకపోవడమే మంచిది అని గుర్తుంచుకోండి.

ఆల్కహాల్ అస్సలు తీసుకోకూడదు. కెఫైన్ వీలైనంత వరకు తగ్గించండి, ఎందుకంటే కెఫైన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురి అవుతారు. విటమిన్, మినరల్స్ సప్లిమెంట్స్‌ను డాక్టర్ చెప్పిన విధంగా తప్పకుండా తీసుకోవాలి. అయితే ఆహారాన్ని తీసుకునేటప్పుడు ఎక్కువగా నమిలి తినాలి ఇలా చేయడం వల్ల డైజెషన్ ప్రక్రియ సులువుగా అవుతుందని గుర్తుంచుకోండి.

**లిక్విడ్స్** : సర్జరీ అయిన రోజు లేక తర్వాత రోజు కేవలం లిక్విడ్స్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు క్లియర్ లిక్విడ్స్ తీసుకోవాలని అనుకుంటే వీటిని తప్పకుండా తీసుకోండి. పంచదార కలపకుండా ఎలాంటి జ్యూస్ అయినా తీసుకోవచ్చు. కెఫైన్ లేనటువంటి టీ, కాఫీ, స్కిమ్డ్ మిల్క్, సూప్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది. ఇది స్టేజ్ వన్‌కు సంబంధించిన లిక్విడ్ ఫుడ్.



**ప్యూరీడ్ ఫుడ్స్** : వారం రోజుల వరకు లిక్విడ్స్ మాత్రమే తీసుకోమని డాక్టర్స్ సూచిస్తారు. కాకపోతే సర్జరీ చేసిన వారం తర్వాత మాత్రమే ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకోవాల్సి ఉంటుంది అంటే వాటి కన్సిస్టెన్సీ అనేది స్మూత్ పేస్టులాగా, మెత్తగా ఉండాలి. ఈ విధంగా రోజుకు 3 నుండి 6 వరకు స్మాల్ మీల్స్‌గా తీసుకోవచ్చు. అయితే ఒక మీల్‌లో కేవలం నాలుగు నుండి ఆరు టేబుల్ స్పూన్ల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని గమనించాలి.

ఇలా ప్యూరీడ్ ఫుడ్‌ని తీసుకుంటున్నా సరే ఆహారాన్ని చాలా నెమ్మదిగా తినాలి. అయితే ఈ విధమైన ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకున్నప్పుడు ఎటువంటి సాలిడ్ పీసెస్ ఆహారంలో ఉండకుండా చూసుకోవాలి. దీనిలో భాగంగా క్రీమీ సూప్స్, గుడ్లు, కాటేజ్ చీజ్, గ్రౌండ్ మీట్ వంటి పదార్థాలతో పాటుగా ఒక లిక్విడ్‌తో బ్లెండ్ చేసుకుని తినొచ్చు. లిక్విడ్స్‌తో బ్లెండ్ చేయడానికి మంచి నీరు, స్కిమ్డ్ మిల్క్, జ్యూస్, సూప్ లాంటి లిక్విడ్స్‌ని ఉపయోగించవచ్చు.

**సాఫ్ట్ ఫుడ్** : ప్యూరీడ్ ఫుడ్స్‌ను కొన్ని వారాల పాటు తీసుకున్న తరువాత సాఫ్ట్ ఫుడ్స్‌ను మీరు డైట్‌లో భాగంగా తీసుకోవచ్చు. కానీ మీరు తీసుకునే ఆహారం చాలా మెత్తగా మరియు తాజాగా ఉంటేనే ఎంపిక చేసుకోండి. రోజుకు మూడు నుండి ఐదు స్మాల్ మీల్స్‌గా తీసుకోవాలి. సాఫ్ట్ ఫుడ్స్‌లో భాగంగా పొట్టు తీసి ఉడికించిన కూరగాయలు, అన్నం, గుడ్లు, ఫిష్, లీన్ మీట్ వంటి మొదలైన ఆహార పదార్థాలను తీసుకోవచ్చు.

**సాలిడ్ ఫుడ్** : గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్‌లో భాగంగా 8 వారాల తర్వాత సాలిడ్ ఫుడ్స్‌ను తీసుకోవచ్చు. సాలిడ్ ఫుడ్స్‌ని తీసుకున్నప్పుడు కొన్ని ఆహార పదార్థాలు నొప్పి, వికారం, వాంతులు వంటి వాటికి గురి చేస్తాయి. కాబట్టి వాటిని తీసుకున్నప్పుడు మీరు ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొంటే కొన్ని మార్పులు చేసుకోండి. సాలిడ్ ఫుడ్స్ లో భాగంగా బ్రెడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, పచ్చి కూరగాయలు, ఉడికించిన కూరగాయలు, ఫ్రైడ్ ఫుడ్స్, పాప్ కార్న్ వంటి ఇతర స్పైసీ ఫుడ్స్ కూడా తీసుకోవచ్చు.

ఈ విధంగా గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్ ని పాటించడం వల్ల సర్జరీ నుంచి త్వరగా రికవరీ అవుతారు. అంతేకాకుండా మీ ఆరోగ్యంతో పాటు బరువు కూడా పర్ఫెక్ట్‌గా ఉంటుంది. సర్జరీ తరువాత అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వలన ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పైగా మోతాదుకు మించి ఆహారాన్ని తీసుకోవడం వలన ఎన్నో రకాల కాంప్లికేషన్స్‌ను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోండి. కాబట్టి ఇలాంటి మార్పులను మీ డైట్ లో చేసుకొని సర్జరీ నుండి వీలైనంత త్వరగా రికవరీ అవ్వండి.

## జ్ఞాపకశక్తికి అద్భుతమైన దివ్యౌషధం ఇదే, ఇలా తీసుకుంటే చాలు



సాధారణంగా పాలను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. అదే పాలలో కొద్దిగా ఎండు ద్రాక్ష మిక్స్ చేస్తే..ఇక దివ్యౌషధమే. ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఆధారంగా ఆరోగ్య స్థితి ఉంటుంది. ఆహారపు అలవాట్లు బాగుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. లేకుంటే అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. మెరుగైన ఆరోగ్యం కోసం డైట్‌లో పాలు, ఎండుద్రాక్ష చేర్చుకుంటే చాలని..అద్భుత ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు వైద్య నిపుణులు.

ఎండుద్రాక్ష, పాలు. రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. రెండింట్లోనూ పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి. ఎండుద్రాక్షలో హెల్తీ ఫ్యాట్స్, ఫైబర్, కాపర్, ఐరన్, కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉంటే..పాలలో కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి అత్యధికంగా ఉంటాయి. అందుకే ఈ రెండూ కలిపి ప్రతిరోజూ తాగితే శరీరంలో పోషక పదార్థాల లేమి తలెత్తదు. ఫలితంగా గంభీరమైన రోగాలు దూరమౌతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

**జ్ఞాపక శక్తి** : రోజూ క్రమం తప్పకుండా పాలు, ఎండుద్రాక్ష కలిపి తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యల్ని జయించవచ్చు. ముఖ్యంగా మెమెరీ పెరుగుతుంది. మెదడు పనితీరు అద్భుతంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బుద్ధి వికసితమౌతుంది. రాత్రి పడుకునేముందు పాలలో ఎండుద్రాక్ష కలిపి తాగడం వల్ల సుఖమైన నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఇదొక మంచి ఔషధం కాగలదు. త్వరగా పడుకునేందుకు కూడా దోహదమౌతుంది.

**ఎముకలు పటిష్టం** : పాలు, ఎండుద్రాక్ష రెండింట్లోనూ కాల్షియం పుష్కలంగా ఉంటున్నందున..ఈ రెండు కలిపి తీసుకోవడం ద్వారా ఎముకలకు బలం చేకూరుతుంది. ఎండుద్రాక్షలో ఉండే బోరాన్ అనే కెమికల్ ఎముకలకు చాలా లాభదాయకం. అటు కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. ఫ్రాక్చర్ కారణంగా ఏర్పడే గాయాలు తగ్గుతాయి. ఇతర చాలా గంభీరమైన రోగాలకు పాలు-ఎండుద్రాక్ష మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుంది.

ఎండుద్రాక్షలో జీర్ణానికి తోడ్పడే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడమే కాకుండా మెటబోలిజంను వృద్ధి చేస్తుంది. శరీరంలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. కోలన్ పనితీరు మెరుగుపడుతుంది. శరీరాన్ని ఎప్పటికప్పుడు డీటాక్సిఫై చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాము.

## ఉల్లిపాయలతో మధుమేహం నియంత్రణ



కొన్నేళ్లుగా మారిన జీవన శైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం వంటి వాటి వల్ల మధుమేహం బాధితులు పెరిగిపోతున్నారు. ఒక్కసారి మధుమేహం బారిన పడితే జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మన రక్తంలో చక్కెర స్థాయిలను, రక్త పోటును నియంత్రించడంలో తోడ్పుతాయి. అలా ఉల్లిపాయలు మధుమేహం నియంత్రణకు తోడ్పడుతాయని తాజాగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో గుర్తించారు.

ఎండోక్రైన్ సొసైటీ సమావేశంలో.. అమెరికాలోని శాన్ డియాగోలో ఇటీవల జరిగిన 97వ ది ఎండోక్రైన్ సొసైటీ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు ఉల్లిపాయలు, మధుమేహంపై చేసిన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఉల్లిలోని 'అల్లియమ్ సెపా' అనే పదార్థం మన రక్తంలో చక్కెర స్థాయిలు 50 శాతం వరకు తగ్గించేందుకు తోడ్పడుతున్నట్టు తాము గుర్తించినట్టు వెల్లడించారు. అంతేగాకుండా శరీరంలో కొలెస్ట్రాల్ ను నియంత్రణలో ఉంచడంలోనూ పనిచేస్తున్నట్టు తెలిపారు.

ఎలుకలపై పరిశోధన చేసి..

ఈ అంశానికి సంబంధించి ఎలుకలపై పరిశోధన చేశామని శాస్త్రవేత్తలు వివరించారు. మొత్తం నాలుగు గ్రూపులుగా ఎలుకలను తీసుకున్నామని.. అందులో ఒక గ్రూపు మధుమేహం లేని ఎలుకలు అని చెప్పారు. మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకలకు.. ఉల్లి నుంచి తీసిన పదార్థాలను వేర్వేరు డోసుల్లో అందించి పరిశీలించామని తెలిపారు.

మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకల్లో.. 'అల్లియమ్ సెపా' డోసు ఎక్కువగా ఇచ్చిన గ్రూపులో రక్తంలో చక్కెర స్థాయిలు బాగా నియంత్రణలో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. అదే సమయంలో వాటిలో కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గాయని వివరించారు.

ఉల్లిపాయలు తీసుకోవడం వల్ల మరో లాభం కూడా ఉందని.. వాటి వల్ల పెద్దగా కెలోరీలు కూడా అందకపోవడం వల్ల అంతిమంగా శరీరంలో గ్లూకోజ్ శాతం పెరిగే పరిస్థితి కూడా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి సంబంధించి మనుషులపైనా ప్రయోగాలు చేయాల్సి ఉందని వివరించారు.

## ఖాళీ కడుపుతో ఉదయాన్నే దానిమ్మ జ్యూస్ తాగితే.. గుండె, రక్తపోటు వంటి ఎన్నో వ్యాధులకు చెక్ పెట్టినట్లే



ఆరోగ్యకరమైన శరీరం పొందడానికి, ఖచ్చితంగా ఆహారంలో పండ్లు, వాటి రసాన్ని చేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. ఇలాంటి వాటిలో దానిమ్మ పండు ఎంతో ఉత్తమంగా పని చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని రుజువు చేస్తుంది. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల అనేక వ్యాధులు నయం అవుతాయని మీకు తెలుసా. ఉదయాన్నే పరగడుపున దానిమ్మ రసం తాగితే రోజంతా శరీరంలో శక్తి ఉంటుంది. శరీరంలో రక్తం లేకపోవడం తొలగిపోయి హిమోగ్లోబిన్ పెరుగుతుంది. విటమిన్ కె, విటమిన్ బి, విటమిన్ ఎ, విటమిన్ డి, కాల్షియం, పొటాషియం, జింక్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రొటీన్లు కూడా దానిమ్మ రసంలో ఉన్నాయి.

ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు..

1- రక్తహీనత దూరం- మీ శరీరంలో ఐరన్ లోపం ఉంటే.. మీరు రక్తహీనతకు గురైనట్లయితే, మీరు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. రోజూ ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల శరీరానికి తగినంత ఐరన్ అందుతుంది. దీని కారణంగా, శరీరంలో ఎర్ర రక్త కణాలు పెరుగుతాయి. రక్తహీనత ఫిర్యాదు అనే సమస్య ఇకపై రాదు.

2- రోగనిరోధక శక్తిని పెంచండి- ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. దానిమ్మ రసంలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్ పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. శరీరాన్ని వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది.

3- ముఖం మెరిసిపోతుంది- దానిమ్మ రసం చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల చర్మం మెరుస్తుంది. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి.

4- గర్భిణీ స్త్రీలకు ప్రయోజనకరమైనది- గర్భధారణ సమయంలో, మహిళల శరీరంలో విటమిన్లు, ఇనుము లేకపోవడం తరచుగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. దీని కారణంగా, శరీరంలో విటమిన్లు, ఐరన్ లోపం నెరవేరుతుంది. శరీరంలో రక్తానికి కొరత ఉండదు. శక్తి కూడా లభిస్తుంది.

5- గుండెకు మేలు చేస్తుంది- రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మలో కొలెస్ట్రాల్‌ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా దానిమ్మ రసం ఖాళీ కడుపుతో తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది.

6- రక్తపోటు నియంత్రణ- దానిమ్మపండులో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. అధిక రక్తపోటు ఉన్నవారు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

## కరివేపాకుతో జుట్టుకు అనేక లాభాలు



కరివేపాకు.. దీనికి కొన్ని ప్రాంతాల్లో కళ్యామాకు అని కూడా అంటారు. చెట్టు సుగంధభరితమైన ఆకులు గల ఒక అందమైన పొద మొక్క లేదా చిన్న చెట్టు. దీని ఆకులని కరివేపాకు అంటారు. మీ అందరికీ బాగా పరిచయం ఉంటుంది. మసాలా దినుసులు, మీ కూరగాయలను రుచిగా మార్చడంలో దీని పాత్ర అధికంగా ఉంటుంది. ఇది ఎక్కువగా ఇండియా, శ్రీలంకలలో కనిపిస్తుంది. కూర, చారు, పులుసు, వగైరా వంటకాలలో సువాసనకోసం వాడుతారు. అంతేకాదు కరివేపాకు వంటలను రుచికరంగా మార్చడంలో మాత్రమే కాకుండా మీ అందాన్ని మరింత మెరుగులు దిద్దడంలో కూడా సహాయ పడుతాయి. వాస్తవానికి, కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. దీనితో పాటు కరివేపాకులో బి విటమిన్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి హెయిర్ ఫోలికల్స్‌లో మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తాయి. దీంతో జుట్టు నల్లగా, తెల్లజుట్టు సమస్య దూరమవుతుంది. కనుక ఇది కొంత ప్రభావం చూపుతుంది.

జుట్టు కోసం కరివేపాకుతో ప్రయోజనాలు

కరివేపాకు కూడా జుట్టు తెల్లబడకుండా కాపాడుతుంది. వాస్తవానికి, కరివేపాకు మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తుంది. మెలనిన్ లోపం వల్ల జుట్టు తెల్లగా మారుతుంది. ఇలాంటి సమయంలో కరివేపాకుతో చేసిన హెయిర్ మాస్క్‌ని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు నెరిసే సమస్య దూరం అవుతుంది. దీనితో పాటు, జుట్టు కూడా మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా తయారు చేయాలి

గ్యాస్ మీద పాన్లో, 2 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడి చేయండి.

ఇప్పుడు దానికి 10-12 కరివేపాకు వేసి 3-4 నిమిషాలు ఉడికించాలి. అప్పుడు గ్యాస్ ఆఫ్ చేయండి.

ఇప్పుడు 20 నిమిషాలు చల్లబరచడానికి పక్కన పెట్టండి. మీ కరివేపాకు హెయిర్ మాస్క్ సిద్ధంగా ఉంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా అప్లై చేయాలి

జుట్టు మీద కరివేపాకు మాస్క్ అప్లై చేయడానికి, రెండు చేతులతో మొత్తం జుట్టు మీద అప్లై చేయండి. ముందుగా ఈ మాస్క్‌తో హెయిర్ రూట్‌లను మసాజ్ చేసి, తర్వాత జుట్టు మొత్తానికి బాగా అప్లై చేయండి. ఒక గంట తర్వాత, ఇప్పుడు జుట్టును బాగా కడగాలి. మీ జుట్టు చాలా మృదువుగా.. మెరిసేలా మారడం మీరు చూస్తారు.

కరివేపాకు, పెరుగుతో కూడా హెయిర్ మాస్క్ తయారు చేసుకోవచ్చు

మీరు కరివేపాకు, పెరుగుతో హెయిర్ మాస్క్‌ని కూడా తయారు చేసుకోవచ్చు. ఈ మాస్క్ చుండ్రును తొలగించడంలో కూడా సహాయపడుతుంది. దీని కోసం, ఒక గిన్నె పెరుగులో 3-4 కరివేపాకులను పేస్ట్ అయ్యే వరకు కలపండి. తర్వాత జుట్టుకు బాగా పట్టించాలి. ఇది మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది.

## జన్మభూమి కమిటీలు మళ్లీ వస్తే ప్రజలకు కైలాసభూమే దిక్కు

### జమ్మలమడక నాగమణి



కాకినాడ, (విశాఖ సమాచారమ్): ఖర్మ కాలీ రాష్ట్రంలో జన్మభూమి కమిటీల వ్యవస్థాపకుడు చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రజలకు కైలాస భూమే దిక్కు అని రాష్ట్ర వైసిపి పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జమ్మలమడక నాగమణి జోస్యం చెప్పారు. రాష్ట్రంలో తెదేపా పాలన వస్తే సచివాలయ,వాలంటీర్ వ్యవస్థ లను రద్దు చేసి,జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి కల్వా శ్రీనివాస్ వాఖ్యాలను ఎండగట్టారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గాంధీజీ గ్రామ స్వరాజ్యం కేవలం ఆంధ్రప్రదేశ్ లో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచన తో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నెరవేరుతుందనీ, దాదాపు 5 లక్షల మంది ఈ వ్యవస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 550 రకాల సేవలు అందిస్తున్నారనీ, గతంలో ఒక పెన్షన్ కావలంటే మరొక పెన్షన్ దారుడు చనిపోతే తప్ప మంజూరు చేయలేని దుస్థితి నుంచి నేడు అర్హత కల్గిన ఏ పథకమైనా వాలంటీరీ, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హుడి ఇంటికి చేరుతున్నాయనీ జమ్మలమడక గుర్తు చేసారు. గతంలో జన్మభూమి కమిటీలనీ అర్హత ప్రమాణికంగా కాకుండా పచ్చ బ్యాచ్ సొంత వారికి లబ్ధిచేకూర్చే వారనీ నేడు, పార్టీ, కులం, మతం చూడకుండా ప్రతీ ఒక్కరూ సంక్షేమ పథకాలు నేరుగా పొందుతున్నారంటే అది కేవలం జగనన్న ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన సచివాలయ,వాలంటీరీ వ్యవస్థ అని జమ్మలమడక అన్నారు. చంద్రబాబు దోపిడీ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవరూ కోరుకునే పరిస్థితి నేడు లేదనీ రానున్న 25 సంవత్సరాలు పారదర్శకతకు మరో పేరు వైసిపి పాలనే కోరుకుంటారనీ జమ్మలమడక ఈ సందర్భంగా తెలిపారు.

# తిరుమలలో వేడుకగా రథోత్సవం

తిరుమల/తిరుపతి: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 7 నుండి ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీథులలో విహరింపజేశారు.

అడుగడుగునా నీరాజనాలు శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. అనాదికాలం నుండి రాజులకు రథసంచారం ప్రసిద్ధం. యుద్ధాలలో కూడా విరివిగా రథసంచారం జరిగినట్లు భారతాది గ్రంథాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడు.

తిరుమలలో రథోత్సవం ఇక ప్రసిద్ధ దేవాలయాలలో ఉత్సవవేళలో దేవుని ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఊరేగించే ఆచారం, ఆగమశాస్త్ర సిద్ధమై బహుళ ప్రచారంలో ఉన్నది. తిరుమలలో రథోత్సవంఅన్నివిధాలా ప్రసిద్ధమైనది. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే అన్న ఆర్షవాక్కులు రథోత్సవంమోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి.

తిరుమాడ వీధులలో తిరుమాడ వీథులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పనతో వివరించడం జరిగింది.

ఇంద్రియాలే గుర్రాలు, ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీథులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో - స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది.రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే.

అన్నమయ్య సకలజీవులలో ! భక్తులు రథాన్ని



లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం. శ్రీవారి రథోత్సవం సందర్భంగా వేలాది మంది భక్తులు తిరువీధుల్లో స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి.

## గ్యాస్ వినియోగంలో కొత్త పరిమితులు..
## నెలకు కేవలం 2.. ఏడాదికి 15 గ్యాస్ సిలిండర్లు మాత్రమే?



గ్యాస్ వినియోగంలో కొత్త పరిమితుల్ని విధిస్తూ కేంద్రస్ ప్రభుత్వం పలు నిర్ణయాలు తీనుకున్నట్లు గా ప్రచారం జరుగుతోంది. తాజాగా వినిపిస్తున్న కేంద్ర నిర్ణయాల్ని చూస్తే.. ఒక వినియోగదారుడు తన కనెక్షన్ మీద ఏడాదికి 15 గ్యాస్ సిలిండర్లు మాత్రమే కొనుగోలు చేయాలన్న రూల్ తీసుకొస్తారని చెబుతున్నారు. అంతేకాదు.. నెలకు కేవలం 2 బండల్ని మాత్రమే కొనుగోలు చేసేలా చట్టంలో మార్పులు తెస్తారంటున్నారు.సబ్సిడీ మీద అందించే గ్యాస్ బండ పక్కదారి పడుతోందని.. దానికి చెక్ పెట్టేందుకే తాజా నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్లను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు కొత్త రూల్స్ ను తీసుకొచ్చినట్లుగా చెబుతున్నారు.కొత్తగా తీసుకునే నిర్ణయాల్లో భాగంగా ఎవరైనా వినియోగదారుడికి అదనంగా సిలిండర్లు అవసరమైతే.. వారు తమ అవసరాన్ని పేర్కొనటంతో పాటు.. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించిన తర్వాతే.. గ్యాస్ సిలిండర్ ను పంపిణీ చేస్తారని చెబుతున్నారు. అదే జరిగితే.. మోడీ సర్కారు మీద మరింత వ్యతిరేకత రాపటం ఖాయమన్న మాట వినిపిస్తోంది.ఐనప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి అధికార ప్రకటన వెలువడనప్పటికీ..మరి..ఈ ప్రచారంలో నిజం ఎంతన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఫ్రెషర్స్‌కు నో జాబ్.. షాకిచ్చిన ప్రముఖ ఐటీ కంపెనీలు



న్యూఢిల్లీ: మాంద్యం ముప్పు ముంచుకొస్తోందని.. ఐటీ కంపెనీలన్నీ పొదుపుబాట పడుతున్నాయి. ఉద్యోగంలో చేరేందుకు ఆఫర్ లెటర్లు చేతిలో పట్టుకున్న ఫ్రెషర్లకు ఐటీ కంపెనీలు షాకిస్తున్నాయి. అన్ని రౌండ్లు పూర్తి చేసుకున్న వారి ఆఫర్ లెటర్లను విప్రో ఇన్ఫోసిస్ టెక్ మహీంద్ర కంపెనీలు రద్దు చేయడం సంచలనమైంది. నివేదికల ప్రకారం వందలాది మంది ఫ్రెషర్లకు ఆఫర్ లెటర్లు ఇవ్వబడ్డాయి. అయితే మొదట ఆ అభ్యర్థుల చేరికను వాయిదా వేశారు. చివరకు తాజాగా వారి ఆఫర్ లెటర్ను రద్దు చేశారు.విప్రో ఇన్ఫోసిస్ మరియు టెక్ మహీంద్రా వంటి అగ్రశ్రేణి ఐటీ మరియు టెక్ సంస్థలు దాదాపు మూడు-నాలుగు నెలల పాటు విద్యార్థులను కంపెనీలో చేర్చుకోవడానికి ఆలస్యం చేసిన తర్వాత వారికి ఇచ్చిన ఆఫర్ లెటర్లను ఉపసంహరించుకున్నాయి. ఆఫర్ లెటర్లు తిరస్కరించబడిన ఫ్రెషర్లకు ఈ కంపెనీలు పంపిన ఇమెయిల్లు చూసి వారంతా షాక్ అయిన పరిస్థితి నెలకొంది.నివేదికల ప్రకారం విద్యార్థులు అనేక రౌండ్ల ఇంటర్వ్యూలు.. కఠినమైన ఎంపిక ప్రక్రియ తర్వాత ఈ ఆఫర్ లెటర్లను అందుకున్నారు. "మీరు మా విద్యా అర్హత ప్రమాణాలకు అనుగుణంగా లేరని గుర్తించబడింది. అందువల్ల మీ జాబ్ ఆఫర్ ను తిరస్కరిస్తున్నాం " అని ఇమెయిల్లలో రాశారు.ఈ నివేదికలపై కంపెనీలు ఇంకా స్పందించలేదు. కానీ దీనికి కారణం మార్కెట్లో మనీ ఫ్లో కఠినంగా మారడం.. ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతుండడం వంటి ప్రతికూల పరిస్థితులతో కంపెనీలు ఇలా చేస్తున్నాయని అర్థమవుతోంది. ఇలా అయితే ఎలా అని ఎంపికైన విద్యార్థులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ప్రపంచ స్థూల ఆర్థిక పరిస్థితులు మాంద్యం భయాలు మరియు పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్య భారతీయ పరిశ్రమలను దెబ్బతీశాయి. దేశంలోని ఐటీ/టెక్ పరిశ్రమ కూడా దీనికి అతీతం కాదని రుజువైంది.రానున్న కాలంలో భారత ఐటీ పరిశ్రమ జోరు మరింత తగ్గుతుందని నిపుణులు ముందే చెప్పారు. టీసీఎస్ ఇంతకుముందు తన ఉద్యోగులకు వేరియబుల్ వేతనాన్ని వాయిదా వేసింది. అయితే ఇన్ఫోసిస్ దానిని 70 శాతానికి తగ్గించింది. విప్రో దానిని పూర్తిగా వాయిదా వేసింది.

# కరుణించవమ్మా కనకదుర్గమ్మ !

చల్లని చూపులతో....చిరుమందహాసంతో కనిపిస్తూ... ఇంద్రకీలాద్రిపైన స్థిరనివాసం ఏర్పరచుకున్న దుర్గాదేవిని శరణుకొరితే సకల శుభాలూ కలుగుతాయి. అందుకే ముక్కోటి దేవతలు సైతం అమ్మ కరుణా కటాక్షాలు తమపైన ఉండాలని దేవిని పూజిస్తారు. జగాన్ని పాలంచే ఆ జగజ్జనని ఇంద్రకీలాద్రిపైన కొలువుతీరడం, శరన్నవరాత్రుల సంప్రదాయం పుట్టుకల వెనుక కొన్ని కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

మహిషాసురమర్దినిగా వెలిసి..... దేవీ భాగవతం ప్రకారం కృతయుగంలో కీలుడు అనే యక్షుడు అమ్మవారిని తన హృదయంలో నిలుపుకొవాలనుకున్నాడు, కీలుడు కోరిక నెరవేరే మార్గాన్ని చెప్పి మంత్రాన్ని ఉపదేశించాడు నారద మహర్షి. కీలుడు ఆ మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేయడంతో జగన్మాత ప్రత్యక్షమై కృష్ణానది ఒడ్డున పర్వత రూపంలో కొలువుదీరమని.... రాక్షస సంహారం అనంతరవ ఆ శిఖరంపైన తాను స్థిరనివాసం ఏర్పరుచుకుంటానని చెప్పిందట.కొన్నాళ్ళుకు మహిషాసురుడనే రాక్షసుడు బ్రహ్మదేవుడి కోసం తపస్సు చేయడంతో బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. అపుడా అసురుడు తనకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించమని అడగడంతో అది ప్రకృతి విరుద్ధమని, అసంభవమని చెప్పి బ్రహ్మ నిరాకరించాడట. దాంతో స్త్రీ అబల కాబట్టి.... ఆమె వల్ల తనకు ఏ ప్రమాదం రాదని భావించిన మహిషాసురుడు పురుషుడి చేతిలో మరణం లేకుండా వరం ఇవ్వమని కోరడంతో బ్రహ్మ అనుగ్రహించాడు. ఆ గర్వంతో మహిషాసురుడు దేవతలను యుద్ధంలో ఓడించి వాళ్లను ఇంద్రలోకం నుంచి తరిమేశాడు. ఆ అసురుడి ఆగడాలకు అంతులేకుండా పోవడంతో ఇంద్రాది దేవతలంతా కలిసి త్రిమూర్తుల దగ్గర మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు కోపోద్రిక్తులు కావడంతో ----ఆ క్రోధం నుంచి తేతోవంతమైన స్త్రీరూపం ఏర్పడిందట. త్రిమూర్తులుచ ఇంద్రాది దేవతలంతా కలిసి...ఆమెకు ఒక్కో ఆయుధాన్ని ప్రసాదించడంతో ఆ దేవి మహిషాసురుడిపైన యుద్ధానికి వెళ్లింది. తొమ్మిది రోజుల పాటు మహిషాసురుడితో యుద్ధంచేసి పదోరోజున ఆ లోక కంటకుడిని వధించిన ఆమె...మహిషాసురమర్ధిని అయ్యిందని, పురాణగాథ. అప్పటి నుంచే దేవీ శరన్నవరాత్రులు మొదలయ్యాయని, పదో రోజున విజయదశిమి చేసుకునే సంప్రదాయం వచ్చిందని ప్రతీతి. అలా వెలసిన అమ్మవారిని ఇంద్రాది దేవతలు దర్శించుకోవడం వల్లే ఈ ప్రాంతం ఇంద్రకీలాద్రిగా మారిందట.

మహిషాసురమర్దినిగా వెలసిన దేవి అప్పటికీ శాంతించక ఈ అరణ్య ప్రాంతంలో ఉన్న జీవాలను మనుషులను బలి కోరేదట. ఆ ఉగ్రరూపాన్ని శాంతంపజేసేందుకు దేవతలు ఋషులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. చివరకు జగద్గురువు ఆదిశంకరాచార్యులు ఈ ప్రాంతానికి వచ్చి ....దేవి గురించి తెలుసుకుని ఇక్కడ శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించి అమ్మవారిని శాంతింపజేశాడని... అలా, దేవి పసుపువర్ణంలో మెరిసిపోతూ మందహాసినియై తన బిడ్డలను కాపాడుతోందని అంటారు. నాటి నుంచి సామాన్య భక్తులు కూడా అమ్మను సేవించడం మొదలుపెట్టారట. శక్తిస్వరూపిణి అయిన అమ్మ....దుర్గముడనే అసురుడిని సంహరించడం వల్లే ఆమెకు ద్గు అనే పేరు వచ్చిందని అంటారు. అదేవిధంగా ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని పాలించిన మాధవవర్మ అనే రాజు నిజాయతీకి,ధర్మనిరతికి మెచ్చి అమ్మకనకవర్షం కురిపించడంతో దేవి కనకదుర్గగా మారిందని పురాణగాథ. నిజానికి అమ్మవారి ఆలయం ....ఇంద్రకీలాద్రిపైన కన్నా ముందు...మొగల్రాజపురంలో ఉన్న ధనంకొండపైన ఉన్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడున్న మూడు గుహల్లో ఒకదాంట్లో దుర్గమ్మను ప్రతిష్ఠించి ఆ తరువాత ఆలయాన్ని నిర్మంచారని కథ.

అక్కడి పోలీసులకు ఆడపడుచు! ఊరేగింపు సందర్భంగా ఓసారి అమ్మవారు మనిషి రూపంలో ప్రస్తుతమున్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర కూర్చుందని అప్పటినుంచి ఆ పోలీస్‌స్టేషన్ అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తోందని చెప్తారు. అందుకే....శరన్నవరాత్రులు ఆ పోలీసుల ప్రమేయంతోనే ప్రారంభమై వాళ్లతోనే ముగుస్తాయి. దసరా ఉత్సవాల ప్రారంభానికి ముందు రోజు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోని వేపచెట్టు దగ్గరున్న అమ్మవారికి ప్రత్యేక పూజల్ని నిర్వహిస్తారు. ఆ తరువాత పోలీస్ అధికారులు ఊరేగంపుగా వచ్చి తల్లికి పట్టువస్త్రాలను సమర్పించడంతో శరన్నవరాత్రులు మొదలవుతాయి. ఆ మర్నాడు అంటే...ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినాడు దేవికి సుప్రభాత సేవ, అభిషేకాలు, గణపతి పూజ, కలశస్థాపన వంటివన్నీ నిర్వహించాక....స్వర్ణకవచాలంకృత దుర్గ రూపంలో అలంకరిస్తారు. ఇలా దశమి వరకు జగన్మాతను రోజుకోరూపంలో అలంకరించడం, భక్తులు చేసే కుంకుమార్చనలు, సాయంత్రాలు నిర్వహించే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, వేదపఠనం...వంటి వాటన్నిటితో శరన్నవరాత్రులు అత్యంతవైభవంగా సాగి తెప్పోత్సవంతో ముగుస్తాయి. తొమ్మిదిరోజులపాటు వివిధ అలంకారాలతో అలసిన అమ్మవారు సేదతీరేందుకే విజయదశమినాడు తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ రోజు సాయంత్రం గంగాసమేత దుర్గామల్లేశ్వర స్వామిని మేళతాళాలలతో ఇంద్రకీలాద్రి నుంచి ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి కృష్ణానదిలో ఏర్పాటు చేసిన హంసవాహనంలో ఆశీనుల్ని చేస్తారు. దుర్గాఘాట్‌కు నుంచి ప్రకాశం భారేజీ మీదుగా తెప్పోత్సవాన్ని నిర్వహించి తిరిగి ఘాట్‌కు తీసుకొస్తారు. ఆ సమయంలో బాణసంచాపేలుళు చూసేందుకు రెండు కళ్లూ చాలవు. అనంతరం ఆ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి మళ్ళీ వన్‌టౌన్ పోలీసులకు అప్పగిస్తారు. వన్‌టౌన్ పోలీసు అధికారి సతీసమేతంగా శమీ పూజను నిర్వహించి విగ్రహాలకు పట్టువస్త్రాలను సమర్పించి ఆ ఉత్సవమూర్తులను ఇంద్రకీలద్రిపైకి చేర్చడంతో దసరా ఉత్సవాలు ముగుస్తాయి.

దసరా వచ్చిదయ్యా...!

ఆ సేతుశీతాచలం భారతీయులంతా శ్రద్ధాభక్తులతో జరుపుకునే పండుగ దసరాపండుగ. వివిధప్రాంతాలలో ఈ పండుగను జరపే తీరు వేరైనా భక్తిప్రవత్తులు మాత్రం అన్ని ప్రాంతాలవారికి సమానమే. ఉత్తరాదిన దీన్ని రామలీలగా అభివర్ణిస్తారు. విజయదశమినాడు రాముడు రావణుని సంహరించాడని దనికి ప్రతీకగా రావణ, కుభకర్ణ, మేఘనాదుల దిష్టిబిమ్మలను తయారుచేసి వాటిని దహనం చేస్తారు. దశమి రోజున ఉదయం నుండే ఔత్సాహికులు రామ,లక్ష్మణ,ఆంజనేయవేషాలను ధరించి వీథులలో ఊరేగుతారు. రామాయణంలోని వివిధపాత్రలను అభినయించడానికి రంగులు పులుముకొని ఆపాత్రలే స్వయంగా విచ్చేసినట్లు భ్రాంతికలిగిస్తూ సాయంత్రం వరకు ఊరేగింపు సాగిస్తూ రామాయణఘట్టాలను అభినయిస్తారు. సాయంసంధ్యాసమయానికి 'రామలీలమైదాన్' పేరుతో నిర్దేశింపబడ్డ మైదానం చేరుకొని అక్కడ సిద్ధంగా ఉన్న రావణ,కుంభకర్ణ,మేఘనాదుల బొమ్మలవద్దకు చేరుకుంటారు, రామలీల దర్శించడానికి ఆ మైదానం చేరుకున్న అశేషప్రజానికం ముందు రామాయణంలోని యుద్ధఘట్టాలను అభినయించి రామపాత్రధారి బాణం ఎక్కుపెట్టి రావణాసురుని నాభిమండలంలో కొడతాడు. అదేవిధంగా లక్ష్మణ పాత్రధారి మేఘనాదుణ్ణి, మరొకరు కుంభకర్ణుణ్ణి తమ నిశితబాణాలకు గురిచేయగా రాక్షసులు ముప్వురు ఏకకాలంలో అగ్నికి ఆహుతి అవుతారు. ప్రజలంతా జయజయనాదాలు చేస్తుంటే



ఫెళఫెళారావాలతో మూడుబొమ్మలు అగ్నికి ఆహుతి అవుతాయి. చెడుపైన మంచి విజయానికి ప్రతీకగా ఈ పండుగను భావిస్తారు.

శివరాత్రినాడు రాత్రిపూజ పరమేశ్వరుడు స్వీకరించాడు. దానికి బదులుగా ఆశ్వయుజ మాసంలో పగటిపూట అమ్మవారికి చెందేలాగ శివుడు వర మిచ్చాడని ఐతిహం.

ఆంధ్రదేశంలోని ప్రతిగ్రామం, పట్టణం, నగరం దేవీనవరాత్రులకు వేదికలవుతాయి. ఆ యా ప్రాంతాలలోనున్న అమ్మవారిదేవాలయాలో దేవికి తొమ్మిదిరోజులు ఆయా ప్రాంతాల ఆచారాల ననుసరించి అవతారాలను అలంకరిస్తారు.

ఆంధ్రదేశంలో దసరాపండుగ కేవలం దేవీపరంగానే కాకుండా పాండవులపరంగా కూడ నిర్వహింపబడుతుంది. పాండవమధ్యముడైన విజయుడు ఆశ్వయుజశుద్ధనవమినాడు శమీవృక్షంపై నిక్షిప్తం చేసిన తమ ఆయుధాలను తీసుకున్నాడని దానికి ప్రతీకగా నవమినాడు ఆయుధపూజ చేసి శమీవృక్షాన్ని కూడ పూజిస్తారు. తమతమ వృత్తులను కీలకమైన ఆయుధాలను ఆ యా వృత్తులవారు పూజిస్తే, బాలబాలికలు తమ పాఠ్యపుస్తకాలను పూజించి విద్యాప్రాప్తి కలిగించమని అమ్మను వేడుకుంటారు.

విజయుడు శమీవృక్షం పై నుండి ఆయుధాలు తీసుకున్నదానికి ప్రతీకగా బాలలంతా గిలకలు పడతారు. 'గిలకలు' అంటే బాణాలు. వెదురుబద్దతో ధనుస్సును తయారుచేసిదానికి అతుక్కొని ఉండేలాగ ఒకటిగాని, రెండుగాని అమ్ములను అమర్చుతాను. వీటిచివర కోనుఆకారంలో కాగితంతో బుట్టలాగ అమరుస్తారు. ఈ బుట్టలో పూలువేసి బాణం సంధించి విడిస్తే బాణం ఎవరిపై ఎక్కుపెట్టారో వారిపై పూలు పడతాయి. గిలకలు పట్టువారు ముందుగా తమ ఉపాధ్యాయుణ్ణి సహవిద్యార్థులను తమయింటికి ఆహ్వానిస్తారు. అమ్మవారిముందు బాలలందరు తమ గిలకలను పెట్టి పురోహితుని ఆదేశానుసారం పూజచేస్తారు. పూజానంతరం ఎవరి గిలకను వారు ధరించి అమ్మకు ఉన్నబుట్టలో సుగంధభరితమైన పుష్పాల నుంచి అమ్మవారిని స్తుతిస్తూ బాణం ఎక్కుపెట్టి అమ్మవారి పాదాలపై పూలు పడేలాగ సంధిసాకతరు. పూలన్ని అమ్మవారిపై పుష్పవృష్టిగా కురుస్తుంటే జయజయధ్వానాలు చేస్తారు. ఈ విధంగా ముమ్మారు చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. తరువాత గురువు పాదాలకు పుష్పాలను సమర్పించి గురువుగారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. గురువు శిష్యులందరివద్ద గురుదక్షిణ స్వీకరించి, వారిని ఆశీర్వదిస్తారు. ఈ సందర్భంగా గురువుకు నూతనవస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. గురువుగారు ముందు నడుస్తుంటే బాలలంతా నగరసంచారానికి బయలుదేరుతారు. ఇంటింటికి వెళ్లి దసరాపద్యాలు చదువుతారు. దైవసంబంధమైన పద్యాలతోపాటు తమకు పప్పుబెల్లాలు, గురువుగారికి దక్షిణలు సమర్పించమని ఈ క్రిందివిధంగా పాడుతారు.

"దసరాకు వస్తిమని విసవిసలు పడక
ఇప్పుడే లేదనక ఇవ్వలేమనక
చేతిలో లేదనక అప్పివ్వరనక
పావలా అయితేను పట్టేది లేదు
అర్ధరూపాయయితె అంటేది లేదు
హెచ్చురూపాయయిన పుచ్చుకొనబోము
అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు
జయవిజయిభవ దిగ్విజయీభవ!
జయవిజయీభవ దిగ్విజయీభవ!!!"

ఈ విధంగా ఇంటింటివద్ద పద్యాలు, పాటలు పాడి తమ విద్వత్తును ప్రదర్శించి పప్పుబెల్లాలు సంపాదించి వాటిని అమ్మవారి ప్రసాదంగా స్వీకరిస్తారు. తమ మేనమామల ఇళ్లవద్దకు వెళ్లినప్పుడు --

"మామయ్య మామయ్య
మముచూచి పరుగెత్తకయ్యా
బంట్రోతును కానయ్య భయపడకుమయ్య
అల్లుణ్ణి నేనయ్య అడగవచ్చితిని
దసరాకట్నంబు లడగవచ్చితిని
తెప్పించి కట్నంబు లిప్పించవయ్య
అయ్యవారికి చాలు ఐదువరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు
జయవిజయీభవ దిగ్విజయీభవ!
జయవిజయీభవ దిగ్విజయీభవ!!

అని చమత్కారంగా పాడి మామను మురిపిస్తారు. దసరా సందర్భంగా దసరాపద్యాలు, పాటలద్వారా పిల్లలు ఎన్నెనో విషయాలు తెలుసుకునేవారు. సమిష్టిగా అందరు కలిసిమెలసి ఉండడం, గురువులయెడల, పెద్దలయెడల గౌరవప్రపత్తులు కలిగి ఉండడం, ఎదుటివ్యక్తిని నొప్పించకుడా ప్రవర్తించడం మొదలైన సద్గుణాలన్నింటిని బాలబాలికలు ఈ దసరాపండుగద్వారా తెలుసుకునేవారు.

మహోత్కృష్టమైన మన ఈ సంప్రదాయాలను పునరుద్ధరించి నేటి బాలలకు కూడా నాటి బాలల అనుభూతులు, ఆనందాలు పంచాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

## స్వర్గీయ ద్రోణంరాజు. శ్రీనివాస రావు ద్వితీయ వర్ధంతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్వర్గీయ ద్రోణంరాజు. శ్రీనివాసరావు 2 వ వర్ధంతి కార్యక్రమాన్ని, శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారు నిర్వహించారు. ముందుగా శ్రీనివాసరావు గారి తనయుడు ద్రోణంరాజు. శ్రీవాత్సవ్ గారు శ్రీనివాసరావు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సభ్యులందరూ శ్రీనివాసరావు గారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. తదుపరి పేదవారికి వస్త్రదానం ,అన్నదానం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిల్ సెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వాత్సవ్ మాట్లాడుతూ, శ్రీనివాస్‌కి సంస్థ అంటే ఎంతో అభిమానం అని, సంస్థ వారి సేవలను గుర్తిస్తూ, విజయ్ సాయి రెడ్డి గారు వంటి ప్రముఖులు తీసుకువచ్చి ముందుకు నడిపించారు. ఆయన బాటలోనే నా వంతు సహాయ సహకారాలను అందిస్తాం అని ఈ సందర్భంగా వాత్సవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, భానోజీ రావు సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## నిజం పత్రిక సత్కారం అందుకున్న ఆజాద్ సంపాదకుడు పితాని ప్రసాద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో నిరంతరం పాత్రికేయుల సంక్షేమానికి పాటుపడుతున్న ఆజాద్, నేషనల్ న్యూస్ ఎక్స్ ప్రెస్ పత్రికల సంపాదకులు పితాని ప్రసాద్, కొయిలాడ పరశురామ్ లు విశాఖ నగరంలో నిర్వహించిన నిజం మాస పత్రిక వార్షికోత్సవ వేడుకల్లో అతిధులచే సత్కారం అందుకున్న సందర్భంగా వారికి నా హృదయ పూర్వక శుభాభినందనలు. పితాని ప్రసాద్, కొయిలాడ పరశురామ్ ల సేవలను గుర్తించి సత్కరించిన నిజం పత్రిక సంపాదకుడు రవికాంత్ కు ప్రత్యేక అభినందనలు. పితాని ప్రసాద్, కొయిలాడ పరశురామ్ లు సాటి పత్రిక యాజమాన్యంచే సత్కారం, అభినందనలు అందుకోవడం 'నిజం'గా పాత్రికేయులందరికీ గర్వ కారణం.

## "అతడ్ని గెలిపిద్దాం" కవితకు "ఎక్సరే" అవార్డు

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** ఎక్సరే 2021 జాతీయ స్థాయి అవార్డు కవి దాకరపు బాబూరావు, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా, రచన "దయచేసి అతణ్ణి గెలిపిద్దాం"కి లభించింది. విజేతకు పది వేల నగదు, జ్ఞాపికతో సత్కరించడం జరుగుతుంది. సాహిత్యప్రియులు, కవులు, అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఈ అవార్డు నిర్వహణ ఈ సంవత్సరంలో నలభై ఒక్క సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రధాన అవార్డుతో పాటు మరో పది మందికి ఉత్తమ పురస్కారాలు కూడా అందజేయబడతాయి.

ఈ సంవత్సరం ఉత్తమ కవితా పురస్కారాలు సింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు) "ప్రళయాన్ని దాటి ప్రశాంతం రావాలి", ఘనాపురం దేవేందర్ (నిజామాబాద్) "చేతి వేళ్లు", అవ్వారు శ్రీధర్‌బాబు (నెల్లూరు) "లాటరీ తగలని ఉదయాలు", చింతా అప్పలనాయుడు (చినగుడబ గ్రామం) "అరిసేతిల బువ్వపువ్వు", శివకుమార్ పేరిసెట్ల (మైపాడు గ్రామం) "ఇత్తడి లోటా" శాంత యోగి యోగానంద (తిరుపతి) "ఆదివాసి ప్రశ్న", మామిడిశెట్టి శ్రీనివాసరావు (దొడ్డిపట్ల గ్రామం) "ధిక్కార స్వరాలు", సాంబమూర్తి లండా (శ్రీకాకుళం) "సమాంతర రేఖలు", శివ శిఖ (ఉండవల్లి) "తప్పిపోయిన నది", గుర్రాల రమణయ్య (నెల్లూరు) "గుండెతడి" అందుకోనున్నారు. 2021 ఎక్సరే అవార్డు నిమిత్తం పోటీకి 355 కవితలు వచ్చాయి. ప్రముఖ సాహితీవేత్త, అరసం అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిన్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.


### పార్ట్‌టైమ్ ఉద్యోగులు కావలెను

ఒక తెలుగు దినపత్రికకు, హిందీ మాస పత్రికకు సంపాదకీయ విభాగంలో ప్రతిదినం నాలుగు గంటల సమయం పని చేయుటకు విడివిడిగా తెలుగు భాషపైన, హిందీభాషపైన తగినంత పరిజ్ఞానం, వ్రాయగల శక్తి, మాట్లాడగలిగిన నైపుణ్యం కలిగి, కేవలం ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తుల నుండి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి.

విశాఖ నగరంలోని మద్దిలపాలెం కార్యాలయంలో ఉదయం 10 నుండి 2 గంటల వరకు గాని లేదా 2 గం. నుండి సా. 6 గంటల వరకు పని చేయవలసి ఉంటుంది. ఆదివారం సెలవు. తెలుగు లేదా హిందీ రచనా వ్యాసంగంలో అభిరుచి, అనుభవం కలిగినవారు, సమాజంపట్ల అవగాహన కలిగినవారు, తెలివితేటలతో కష్టించి పనిచేయగలిగే తత్వం, అంకితభావం గల అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూకు ఆహ్వానించబడుదురు.

ఫోన్‌ద్వారా వివరములు కోరడం అనర్థం. అభ్యర్థులు తమ అనుభవం, ఆసక్తి, నైపుణ్యం, ఆశిస్తున్న వేతనం, ఉద్యోగం యొక్క అవసరం వంటి వివరాలను తెలియబరుస్తూ వాట్సాప్ ద్వారా 30 సెప్టెంబరు 2022లోగా దరఖాస్తును 8331949347 నెంబరుకు పంపవచ్చును.


## ఘనంగా విజయ దుర్గాదేవి శరన్నవరాత్రులు



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 9వ వార్డు హనుమంతువాక దరి విజయ దుర్గా కోలనీలో విజయదుర్గాదేవి శరన్నవరాత్రులు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. 9 రోజుల పాటు అమ్మవారికి వివిధ రకాల అలంకరణలతో అలంకరించి అమ్మవారిని ఘనంగా పూజలు చేశారు. ఆహ్వానం కమిటీ మేరకు టీడీపీ పార్లమెంట్ విశాఖ ఎస్సీసెల్ అధ్యక్షులు 9వ వార్డు ఇన్‌ఛార్జ్ బుడుమూరి గోవింద్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని వడ్డించారు. ఇందులో భాగంగా నంబూరి మల్లికార్జునరావు దంపతులు, ఆలయ అధ్యక్షులు ఎస్.ఎస్.ఎన్.రాజు దంపతులచే కలస్థాపన చేశారు. మంగళవారం మహర్ణవమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సంపత్ కుమార్ శర్మ పర్యవేక్షణలో వేదపండితులచే సామూహిక లక్ష కుంకుమార్చనలు మహిళలచే నిర్వహించారు. అనంతరం అన్న సమారాధాన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ వి.నాగభూషణరావు, వైస్ ప్రెసిడెంట్ డి.వి.ఎల్.ఎన్.స్వామి పర్యవేక్షించారు.




























VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.